

రేపు ప్రత్యేక విద్యుత్ అదాలత్

ప్రజాశక్తి - కడప : ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కడప డివిజన్ ఆధ్వర్యంలో ఈనెల 24న ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు కడప నగరం శంకరాపురం నెహ్రూ పార్క్ వద్దగల కడప ఆపరేషన్ డివిజన్ కార్యాలయం కాంపౌండ్‌లో ప్రత్యేక విద్యుత్ ఆదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కార్య నిర్వాహక ఇంజనీర్ ఎన్. హరి సేవ్య నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని తమ విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. చైర్ పర్సన్, రిటైర్డ్ న్యాయమూర్తి వి. శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు కె. రామమోహనరావు, సాంకేతిక సభ్యులు ఎస్. ఎల్. అంజనీ కుమార్ లచే కడప ఆపరేషన్ డివిజన్ పరిధిలో టౌన్-1, టౌన్-2, రూరల్-1, రూరల్-2, ఒంటిమిట్ట సబ్ డివిజన్ పరిధిలోని సెక్షన్లకు, మండలాలకు సంబంధించి ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

స్వయం ఉపాధి రుణాలకు కసరత్తు

- రూ.54.47 కోట్లతో సబ్సిడీ రుణాలు
- జిల్లాకు 2,245 యూనిట్లు మంజూరు
- తెరుచుకోని ఆన్‌లైన్ వెబ్‌సైట్



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో స్వయం ఉపాధి రుణాల అందజేతకు కసరత్తు ఊపందుకుంది. ప్రభుత్వం జిల్లాలోని తొమ్మిది సామాజిక తగతులకు 2,245 యూనిట్లను ఖరారు చేసింది. మొదటి వరుసలో రూ.48.63 కోట్లు, ఇందులో అందని వారికి మరో రూ.5.84 కోట్లు వెరసి 54.47 కోట్లు అందజేయనుంది. బిసి కార్పొరేషన్ అధికార యంత్రాంగం ఆయా మండలాల వారీగా లక్ష్యాలను నిర్దేశిస్తూ ఆదేశాలు జారీ చేసింది. రుణాల మంజూరుకు అర్హత కలిగిన యువత బ్యాంకు గ్యారెంటీలతోపాటు అధికార యంత్రాంగం ఇంటర్వ్యూలను అధిగమించాల్సి ఉంది. నిరుద్యోగ యువత ఎంపిక చేసుకున్న యూనిట్ల పరిశీలనకు జిల్లా అధికారులను బృందాలుగా ఏర్పరచి మానిటరింగ్ చేయనుంది.

జిల్లాలో 36 మండలాలు ఉన్నాయి. రూ.54.47 కోట్లతో బిసి, ఇబిసి, ఏడు సామాజిక తరగతులకు చెందిన యువతకు 2,172 యూనిట్ల మేరకు సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ కల్పించనుంది. బిసి కార్పొరేషన్ యూనిట్లు 1,550, ఇబిసి యూనిట్లు 74, కమ్మ కార్పొరేషన్ యూనిట్లు 27, రెడ్డికార్పొరేషన్ యూనిట్లు 98, ఆర్యవైశ్య రుణ యూనిట్లు 17, క్షత్రియ కార్పొరేషన్ యూనిట్లు 16, బ్రహ్మణ కార్పొరేషన్ 8, కాపు కార్పొరేషన్ యూనిట్లు 379, కాపు ఎంఎస్ఎంఇ గ్రూపు రుణాలు 3 చొప్పున యూనిట్లు ఉన్నాయి. ఒక్కో యూనిట్ రూ.ఐదు లక్షలు, ఇబిసి యూనిట్ రూ.8 లక్షల చొప్పున కేటాయించింది. ఈలెక్కన ఆయా యూనిట్లకు కేటాయించిన రూ.4.8 కోట్లలో 2.39 కోట్ల సబ్సిడీ లభించనుంది. ఇబిసి రుణాలు, ఇతర సామాజిక తరగతుల కింద అర్హులైన వారికి చెందిన



యూనిట్‌కు రూ.ఎనిమిది లక్షల చొప్పున అందించ నుంది. ఈ కేటగిరీ కింద 73 యూనిట్లను మంజూరు చేసింది. ఇందులోని రూ.4.8 కోట్లలో రూ.2.92 కోట్లు సబ్సిడీ లభించనుంది. ఈలెక్కన 50 శాతం సబ్సిడీతో రుణాలను విడుదల చేయ నుంది.

తెరుచుకోని ఆన్‌లైన్ వెబ్‌సైట్

ప్రభుత్వం స్వయం ఉపాధి రుణ యూనిట్లను విడుదల చేస్తోందనే ప్రచారం నేపథ్యంలో వెనుకబడిన తరగతులకు చెందిన యువత బిసి కార్పొరేషన్ చుట్టూ తిరుగుతోంది. వెనుకబడిన తరగతుల విభాగం నుంచి యూనిట్ల వివరాలు వెల్లడికావడం ఉత్సుకతను నింపింది. జిల్లాలోని ఆయా సామాజిక తరగతులకు చెందిన యువత ఆధార్, రేషన్, కుల ధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్ వెబ్‌సైట్‌ను ఆశ్రయించారు. ఎంతకీ తెరుచుకోని నేపథ్యంలో జిల్లాలోని 2,245 యూనిట్లకు దరఖాస్తు చేసుకునేందుకు నిరుద్యోగ యువత నిరీక్షిస్తోంది. వైసిపి సర్కారు హయాంలో స్వయం ఉపాధి రుణ యూనిట్లు మూతబడిన సంగతి తెలిసిందే. కూటమి సర్కారు స్వయం ఉపాధి యూనిట్లకు ఊపిరిపోయడంతో పెద్దఎత్తున యువత ఎదురు చూస్తోంది.

అర్హులకు రుణాలు దక్కేనా!

జిల్లాలో బిసి జనాభా 56 శాతానికి పైగా ఉంది. బిసి రుణ యూనిట్లకు పరిమితం చేసిన నేపథ్యం సందేహాలకు తావిస్తోంది. జిల్లాకు కేటాయించిన బిసి రుణ యూనిట్లను మొదటి వరుసలో ఉన్న రాజకీయ నాయకుల అనుచరులు దక్కించుకునే అవకాశాలు అధికంగా ఉన్నాయని చెప్పవచ్చు. రాజకీయ, బ్యాంకింగ్ అధికారులతో పలుకుబడి లేని నిరుద్యోగులకు రుణాలు దక్కే అవకాశాలు దాదాపు మృగ్యమనే వాదన వినిపిస్తోంది.

తక్షణమే నియామకాలు చేపట్టాలి

ఎల్ఐసి యూనియన్ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎల్ఐసి యాజమాన్యం ప్రకటించిన మేరకే 2,700 మంది అసిస్టెంట్ల ఖాళీగా ఉన్నాయని, క్లాస్ 4 నూతన నియామకాలు చాలాకాలంగా జరగడంలేదని, తక్షణం ఈ కేడర్లలో రిక్రూట్మెంట్ చేపట్టాలని ఎల్ఐసి ఉద్యోగుల సంఘం కడప డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎ.రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం డివిజన్ అధ్యక్షుడు అవధానం శ్రీనివాస్ ఆధ్వర్యంలో దేశవ్యాప్త పిలుపుమేరకు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ రెండు సంవత్సరాల్లోనే, 5,400 మంది సిబ్బంది సంఖ్య తగ్గిందని, రాబోయే రెండు, మూడు సంవత్సరాల్లో పెద్ద సంఖ్యలో సిబ్బంది రిటైర్డ్ అవుతారని తెలిపారు. ఈ నేపథ్యంలో క్లాస్ 3,4 కేడర్లలో తక్షణమే రిక్రూట్మెంట్ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎల్ఐసిలో 86శాతం మంది సిబ్బందికి ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఎఐఐఇఎ) ప్రాతినిధ్యం వహిస్తోందని, అంతర్జాతీయ కార్మిక సంఘం నిబంధనల మేరకు తమ సంఘానికి గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో, రాబోయే కాలంలో నూతన నియామకాల కోసం, తమ సంఘానికి గుర్తింపు కోసం సమ్మెకైనా సిద్ధమని పేర్కొన్నారు. నిరసన ప్రదర్శనలో యూనియన్ నాయకులు అక్బర్ బాషా, వసుప్రద, వారిజాతమ్మ, రాజు, రత్న కిషోర్, కుమార్, రఘు, జయచంద్ర, శ్రీనివాసులు పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్:** ఎల్ఐసి యాజమాన్యం ప్రకటించిన మేరకు భర్తీ చేయని 2,700 మంది అసిస్టెంట్ల పోస్టు ఖాళీగా ఉన్నాయని, తక్షణం రిక్రూట్మెంట్ చేపట్టాలని ఎల్ఐసి ఉద్యోగుల సంఘం జమ్మలమడుగు బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎల్ఐసి కార్యాలయం ఎదుట బ్రాంచ్ ఉపాధ్యక్షుడు డి నరసింహం ఆధ్వర్యంలో దేశవ్యాప్త పిలుపుమేరకు జరిగిన నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అధ్యక్షులు బాలరాజు బ్రహ్మయ్య, హరి నాయక్ పాల్గొన్నారు.



నూతన నియామకాల కోసం నిరసన ప్రదర్శనలో ఎల్ఐసి సిబ్బంది

జమ్మలమడుగు సమగ్ర అభివృద్ధికి శ్రీకారం : కలెక్టర్



స్థలం వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగులో సమగ్ర అభివృద్ధికి శ్రీకారం చుట్టబోతున్నామని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు. బుధవారం జమ్మలమడుగులో కలెక్టర్ పర్యటించారు. మండల పరిధిలోని దేవగుడి, మోరగుడి పట్టణంలోని పతంగే రామన్నరావు ఉన్నత పాఠశాలలో స్థల పరిశీలన చేశారు. అనంతరం ఆయన మాటాడుతూ ఈ మూడు ప్రదేశాలలో మెగా ఇంటిగ్రేటెడ్ కిచెన్‌లను ఏర్పాటు చేసి ఇక్కడి నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు భోజనాన్ని అందించేందుకు స్థలాన్ని పరిశీలించామని చెప్పారు. ప్రిన్సిపల్, సిబ్బందితో సంభాషించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోలార్ కంపెనీలో పని చేసే వారికి నైపుణ్యం నేర్పించేందుకు అనుకూలంగా ఉందాలేదా అలాగే ఫైర్ స్టేషన్ వద్ద 100 పడకల వైద్యశాల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ సాయిశ్రీ, జమ్మలమడుగు తహశీల్దార్ ,ఎంఇఒలు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ 28వ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- కడప అర్బన్

ఎస్ఎఫ్ఐ 28వ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని ప్రకాష్ నగర్ ప్రభుత్వ ఎస్‌సి హాస్టల్‌లో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30, 31వ తేదీలలో కడప నగరంలో మహాసభలు ఉంటాయని చెప్పారు. రాష్ట్రంలోని విద్యా రంగంలో ఉన్న సమస్యలు పరిష్కారం కోసం భవిష్యత్తు పోరాటానికి శ్రీకారం చుట్టడం ప్రణాళిక సిద్ధం చేస్తామని తెలిపారు. కేంద్రంలో మూడవసారి అధికారంలో వచ్చిన బిజెపి ప్రభుత్వం విద్య వ్యవస్థ పూర్తిగా నాశనం చేస్తుందని విమర్శించారు. నూతన జాతీయ విద్యా విధానం పేరుతో దేశవ్యాప్తంగా విద్యను కాషాయికరణ, ప్రయివేటీకరణ చేయడంలో ప్రయత్నం భాగంగా ఇప్పటికై దేశం ఉన్నవంటి అన్ని సెంట్రల్ యూనివర్సిటీ ఆర్ఎస్ఎస్ వాదనలను ప్రొఫెసర్స్‌గా నియమకాలు చేస్తున్నారు .ఇది సరైన విధానం కాదదన్నారు. ప్రయివేటీకరణ చేయడంలో బిజెపి ముందు భాగంలో ఉంటుందని పేర్కొన్నారు. అందులో ప్రధానంగా రాష్ట్ర విద్య రంగానికి బడ్జెట్ కేటాయించకపోవడం, రాష్ట్ర ఉమ్మడి జాబితా ఉన్న విద్య హక్కులను కేంద్రంలో బిజెపి కలరాస్తుందని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం అధికారంలో వచ్చి దాదాపు 7 నెలలు కావస్తున్నా ఉన్నత విద్యకు సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్ రూ .2780 కోట్లు విడుదల చేయలేదని వాపోయారు. సమస్యలను పరిష్కారం కోసం భవిష్యత్తు పోరాటాలకు ప్రణాళిక సిద్ధం చేయడానికి ఈ మహాసభ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మహాసభల్లో విద్యార్థులు, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు జాలా సుమంత్, ఉపాధ్యక్షులు వంశీ, వినోద్, నగర నాయకులు మనోహర్, అభిలాష్ తిరుపాల్ పాల్గొన్నారు.

క్లోరిన్ నీటితో ఇంటి నిర్మాణానికి ముప్పు

ప్రజాశక్తి - గోపవరం

బద్వేల్ మున్సిపాలిటీ సరఫరా చేసే తాగునీరును ఇంటి నిర్మాణాలకు వాడితే నీటిలో తగు మోతాదులలో క్లోరిన్ ఉండడం వల్ల నిర్మాణాలు త్వరగా పాడవుతాయని మున్సిపల్ కమిషనర్ నరసింహరెడ్డి తెలిపారు. బుధవారం మున్సిపల్ సిబ్బందికి పలు సూచనలిచ్చారు. చాలా మంది పురపాలక సంఘం ద్వారా అందించే తాగునీటిని అనుమతి లేకుండా ఇంటి నిర్మాణ పనులకు , స్లాబ్, క్యూరింగ్, ఇతర నిర్మాణ పనులకు వాడ్నుతున్నారని తెలిపారు. బ్రహ్మ సాగర్ నుంచి మున్సిపాల్టీకి అందించే తాగునీటిలో తగు మోతాదులో క్లోరిన్ ఉండడం వల్ల నీటిని స్లాబ్, క్యూరింగ్ ఇతర ఎలాంటి నిర్మాణ పనులకు వాడతే ఇనుము, సిమెంట్ తదితర వాటితో రియాక్షన్ జరిగి ఇంటి నిర్మాణాలు త్వరగా పాడవుతాయి పేర్కొన్నారు. నీరు సరఫరా చేయు సిబ్బంది నిత్యం తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎవరైతే కనెక్షన్ తీసుకున్నరో ఆ కుళాయి కనెక్షన్‌లు తక్షణమే తొలగించాలన్నారు. తొలగించక పోతే వారిపై చట్టపరమైన కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆ ఏరియా నీటి సరఫరా సిబ్బంది పై చర్యలు తీసుకుంటామన్నారు. నీటి సరఫరా చేసే సిబ్బంది తరచుగా క్లోరిన్ టెస్ట్ చేస్తూ అవసరమైన జాగ్రతలు తీసుకుంటూ ఉండాలని తెలిపారు. మున్సిపాల్టీ వాటర్ ట్యాంక్‌లు ప్రతి నెలా శుభ్రం చేస్తూ నాణ్యమైన క్లోరినేషన్ వాటర్‌ను అందించాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని, నీరు వదిలే టైమింగ్ తెలియజేయాలని సూచించారు. వీధులలో నీరు వదిలేటప్పుడు ఒకే టైమింగ్ మెయింటైన్ చేయాలని తెలియజేశారు. అక్రమ కుళాయిలు అన్నీ కూడా తక్షణమే రెగ్యులర్ చేయించాలని లేని పక్షంలో కుళాయిలు తొలగించాలని సిబ్బందికి తెలిపారు. ప్రజలందరు కూడా సకాలంలో నీటి పన్నులుతో పాటు అన్ని రకాల పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. నీటి మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు అందజేస్తామని తెలిపారు.



సిబ్బందితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

అమిత్‌షా తక్షణమే రాజీనామా చేయాలి

ప్రజాశక్తి - కడప : అంబేద్కర్‌ను అవమానించిన కేంద్రహోం శాఖ మంత్రి అమిత్ షా తక్షణమే రాజీనామా చేయాలని డిసిసి అధ్యక్షులు ఎన్.డి. విజయజ్యోతి పేర్కొన్నారు. బుధవారం కడప నగరంలో డిసిసి ఆధ్వర్యంలో బుధవారం పాదయాత్ర నిర్వహించారు. కోటిరెడ్డి సర్కిల్ నుంచి ఆర్‌టిసి బస్టాండ్ వద్దనున్న అంబేద్కర్ విగ్రహం వరకు పాదయాత్ర సాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమిత్‌షా పార్లమెంట్‌లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వ్యక్తిత్వాన్ని అవమానించారని ఆరోపించారు. ఈనెల 23 న పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థల వెలుపల రాజ్యాంగ ప్రకటన కరపత్రాలు పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోరాటం అమిత్ షా రాజీనామా చేసేంతవరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కడప అసెంబ్లీ కో- ఆర్డినేటర్ బండి జకరయ్య, సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు అఫ్జల్ ఖాన్, పులివెందుల అసెంబ్లీ కో-ఆర్డినేటర్ ధ్రువ కుమార్‌రెడ్డి, పిసిసి ప్రధాన కార్యదర్శి పటాన్ మహమ్మద్ అలీఖాన్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుశీల్ కుమార్, మోహన్ పాల్గొన్నారు.

నేడు బహిరంగ వేలం

ప్రజాశక్తి- గోపవరం : బద్వేల్ మండలం లంకమలలో వెలిసిన శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా తల నీలా లను ఈనెల 23న సాయంత్రం 3 గంటల బద్వేల్ నెల్లూరు రోడ్డులో ఉన్నటు వంటి శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో బహిరంగ వేలం నిర్వహి ంచనున్నట్లు కార్య నిర్వాహణ అధికారి రామలింగారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మల్లెం కొండలులో తలనీలాలను వేలం పాటలో పాల్గొనేవారు రూ. 50 ధరావత్తు చెల్లించాలని, లంకమలలో తలనీలాలు సేకరణ వేలంపా లో పాల్గొనేవారు. రూ. 25 చెల్లించాలని టెంకాయల వేలంపాటలో రూ. 10 వేల ధరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలన్నారు.

పారిశుధ్య కార్మికులకు నగదు బహుమతి

ప్రజాశక్తి - కడప

పారిశుధ్య కార్మికుల కృషిని గౌరవిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున ముగ్గురు పారిశుధ్య కార్మికులకు నగదు బహుమతిని బుధవారం తన ఛాంబర్‌లో కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ మైదుకూరు మున్సిపాలిటీకి చెందిన పారిశుధ్య కార్మికులు పి.అమ్ములమ్మ, జి. చెన్నమ్మ, యం.గంగాధం విలువలు పాటిస్తూ విధులపట్ల అంకిత భావంతో సమాజ శ్రేయస్సుకు ఎంతో విలువైన సేవలందిస్తున్నారన్నారు. రోజూ ఉదయం 5.30 గంటలకే విధులకు హాజరై మైదుకూరు రోడ్లు, టౌన్, పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుతున్నారని చెప్పారు. వీరి కృషి, పట్టుదలను గుర్తించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 18న మైదుకూరు సభలో ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున ముగ్గురు పారిశుధ్య కార్మికులకు మూడు లక్షల నగదు బహుమతిని ప్రకటించారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన ఈ హామీని జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి ఆ ముగ్గురు పారిశుధ్య కార్మికులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున మూడు లక్షల నగదు (చెక్కు రూపంలో) బహుమతిని అందించారు. తమ సేవలను గుర్తించినందుకు పారి శుధ్య కార్మికులు ముఖ్యమంత్రికి, కలెక్టరుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జెసి అదితి సింగ్, మైదుకూరు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులకు నగదు బహుమతి అందజేస్తున్న కలెక్టర్

వెల్నెస్ క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్



క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో డిఎంఇ, ఏపి వారి ఆదేశాల మేరకు వెల్నెస్ క్లినిక్‌ను ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వెల్నెస్ క్లినిక్ సోమ, బుధవారం పనిచేస్తుందని తెలిపారు. ఓపి నంబర్ 222లో అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఈ ఓపిని కమ్యూనిటీ మెడిసిన్ డిపార్ట్‌మెంట్ వైద్యులు, డైటీషియన్స్, నర్సింగ్ సిబ్బంది నిర్వహిస్తారని పేర్కొన్నారు. జీవనశైలి మార్పులు వల్ల వస్తున్న వివిధ రకాల వ్యాధులు, బిపి, షుగర్, గుండె జబ్బులు, కిడ్నీ జబ్బులు వంటివి చిన్న వయసులోనే వస్తున్నాయని తెలిపారు. ఇలాంటి వాటిని ముందుగానే గుర్తించి నివారించడానికి ఇక్కడ ప్రత్యేక ఓపి నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ వెల్నెస్ క్లినిక్‌ని ప్రజలు సద్వినియోగం చేసుకుని చిన్న వయసులోనే పైన పేర్కొన్న వ్యాధులు రాకుండా జాగ్రత్త పడాలని చెప్పారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ జి.వి.రమాదేవి, ఎస్ పి ఎం డిపార్ట్‌మెంట్ హెచ్ఒడి డాక్టర్ గోపి క్రిష్ణ, సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ వై .శ్రీనివాసులు, డాక్టర్ ఎస్. ఆర్. రాజేశ్వరి, ఎస్.పి.ఎం విభాగం లోని వైదులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఇగా అబ్దుస్ సమి

ప్రజాశక్తి - కడపసిటీ



కడప ఇరిగేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్‌గా ఎం. అబ్దుస్ సమి బుధవారం తమ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు బాధ్యతలు చేపట్టారు. ఈయన అనంతపురం జిల్లా, హెచ్‌సిఎల్ సర్కిల్, ధర్మవరం కెనాల్ డివిజన్‌లలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీల ప్రక్రియలో భాగంగా ఉద్యోగోన్నతిపై ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఇగా ఇక్కడికి వచ్చారు. గతంలో ఎస్ఇగా విధులు నిర్వహిస్తున్న కె. శ్రీనివాసులు సిఇ గా బాధ్యతలు చేపట్టారు. ఈ సంద ర్భంగా ఎం అబ్దుస్ సమి మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న పనులను ప్రభుత్వ సహకారంతో పూర్తి చేస్తామన్నారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్క రిస్తామన్నారు. ఎస్ఇ కి కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

12వ పిఆర్‌సిని అమలు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి- కడప అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు తక్షణమే 12వ పిఆర్‌సిని అమలు చేయాలని యుటిఎఫ్ జిల్లా శాఖ నాయకులు కోరారు. బుధవారం యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు డిఆర్ఒఎం.విశ్వేశ్వర నాయుడును కలసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ 2023, జులై 1 నుంచి 12వ పిఆర్‌సిని అమలు చేయాలన్నారు. ఈవిషయంలో పాలకులు వైఫల్యం చెందారని పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వం హయాంలో పిఆర్‌సి విషయంలో ఉద్యోగులకు తీవ్ర అన్యాయం చేశారని తెలిపారు. ఉద్యోగులు తమ అవసరాల కోసం దాచుకున్న ప్రావిడెంట్ ఫండ్, ఎపిజిఎల్ఐ లాంటి సొమ్ములను సైతం తమ అవసరాలకు మళ్లించుకున్నారని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్యోగులకు అండగా నిలుస్తుందని తెలిపారు. మెరుగైన వేతనాలను అమలు చేస్తామని, ఉద్యోగుల బకాయిలను చెల్లిస్తామని కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు సహకరించారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల అండదండలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉద్యోగులను పూర్తిగా విస్మరిస్తున్నదని పేర్కొన్నారు. పిఆర్‌సి అమలయ్యే వరకు 30 శాతం మధ్యంతర భృతిని చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 వేల కోట్ల పైబడిన బకాయిలకు చెల్లింపులు లేవన్నారు. ఇటీవల నామమాత్రంగా ప్రావిడెంట్ ఫండ్, మెడికల్ రీయంబర్స్‌మెంట్‌కు బకాయిలలో 10 శాతం మాత్రమే చెల్లింపులు చేపట్టారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జిఓఐ 57ను అమలు చేస్తూ 11 వేల మంది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తూ ఉత్తర్వులను వెలువరించాలన్నారు. లేనిపక్షంలో ఫిబ్రవరి నుంచి పోరుబాట పడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు వై.రవికుమార్, డి.సుజాతా రాణి, ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శులు ఎస్.ఎజాస్ అహ్మద్, ఈదరి బాలజ్యోతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.రూతు ఆరోగ్య మేరి పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రజా కవులు కావాలి

ప్రజాశక్తి- కడప అర్బన్

వైవీయూ విద్యార్థులు యోగిలా సమాజంలోకి వెళ్లకుండా ప్రజాకవులుగా వెళ్లాలని తిరుపతి ఎస్‌వియు తెలుగు శాఖ రిటైర్డ్ ఆచార్యులు మేడిపల్లి రవికుమార్ అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయంలో వేమన జయంతి మహోత్సవం బుధవారం నిర్వహించారు. 'వేమన తాత్విక చైతన్య యాత్ర' అధికారులు, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందితో పరిపాలన భవనం నుంచి మొదలై సైన్సు బ్లాక్ మీదుగా పులివెందుల కడప రహదారిపై నుంచి ప్రధాన ద్వారా నూతన పరిపాలన భవనం వరకు చేరుకుంది. విశ్వవిద్యాలయ ప్రధాన ద్వారం వద్ద వేమన విగ్రహానికి బాధ్య విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ ఎస్. రఘునాథ రెడ్డి, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మా పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం అన్నమయ్య సెనెట్ హాల్లో నిర్వహించిన ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని అతిథుల జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా మేడిపల్లి రవికుమార్ మాట్లాడుతూ వేమన ప్రపంచం విస్తృతం, యోగిగా మార్చి ఒక చట్రంలోకి తీసుకువెళ్లడాన్ని, ఒక వర్గ తన వాడుగా చెప్పుకునే ప్రయత్నంపై పెదవివిరిచారు. వేమనను అధ్యయనం చేయడం అంటే జీవితాన్ని అనుసరించడమన్నారు. తొలిసారిగా ఇతిహాసాలు, పురాణాలతో సంబంధం లేకుండా జీవితంలోని అంశాలను వేమన చెప్పాంని పేర్కొన్నారు. వేమన నాలుగు వందల ఏళ్ల కింద ఏ సామాజిక భావజాలాన్ని అయితే కోరుకున్నారో అది నేటికి నెరవేరలేదన్నారు. వేమనది పుస్తకాల భాష కాదని తాత్వికతతో కూడిన సణుగుడు, గొణుగుడులే పద్యాలుగా వచ్చాయన్నారు. మూఢవిశ్వాసాలను తూర్పారబట్టిన విప్లవవాది వేమన అన్నారు. విసి మాట్లాడుతూ వేమన పద్యాల్లో మానవ పరిణామ క్రమం కనిపిస్తుందన్నారు. అనంతరం కీలకోపన్యాసకులు ఆచార్య మేడిపల్లి రవికుమార్‌ను విశ్వవిద్యాలయం తరఫున సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎస్. రఘునాథరెడ్డి, వివిధ విభాగాల డీన్లు, ఆచార్యులు, సహ, సహాయాచార్యులు, అకడమిక్ కన్సల్టెంట్లు, స్కాలర్లు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కాండం తెగుళ్లు నివారించాలి


ప్రజాశక్తి - వల్లూరు



రైతులకు సూచనలిస్తున్న ఎడిఎ

వరి పంటలో కాండం, ఆకుముడత తెగుళ్లు సోకకుండా తగు జాగ్రత్తలు చర్యలు చేపట్టాలని కమలాపురం వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి అన్నారు. బుధ వారం మండల కేంద్రంలోని ఇసుకపల్లి, సి. కొత్తపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించి వరి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులకు సూచనలు సలహాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటలో ఎరువుల యాజమాన్యం సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. వరిలో ఆకుముడత కాండం తులసి పురుగు ఆశించినట్లయితే అసిఫాటట్ 1.5 గ్రాములు లేదా కార్ టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు ఒక లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని తెలిపారు. వరి పంట సాగు చేసేవారు దుక్కిలో ఎకరాకు 20 కేజీల జింక్ సల్ఫేట్ మూడు పంటలకు ఒకసారి కచ్చితంగా వేసుకోవాలి అని తెలియజేశారు. వరి నాటిన పొలంలో జింకు దాతు లోపం గుర్తించినట్లయితే చిలేటెడ్ జింకు 1 గ్రాము, యూరియా 5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయా చేయాలన్నారు. అదేవిధంగా 19-19-19 10 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేసిన పంట పెరుగుదల బాగా ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సాయి జ్యోతి, గ్రామ వ్యవసాయ సహాయకురాలు సురేఖ , రైతులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో మెరిసిన ఆణిముత్యం



విద్యార్థినిని అభినందిస్తున్న హెచ్‌ఎం

ప్రజాశక్తి - కడప అర్బన్ : 'కళ్లు లేకపోవటం లోపం కాదు, మా సత్తా మాదే' అని ప్రభుత్వ అంధుల ఉన్నత పాఠశాల విద్యార్థిని నాజియా తబుసుం నిరూపించింది. రిపబ్లిక్ డే సందర్భంగా నిర్వహించిన దేశభక్తి పాటల పోటీల్లో మండల స్థాయిలో పాల్గొని గెలుపొందారు. బుధవారం జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం పొందారని పాఠశాల ప్రధా నోపాధ్యాయుడు వేపరాల ఏబెనెజర్ తెలిపారు. బహుమతి ప్రదానోత్సవంలో ఉప విద్యాధికారి రాజ గోపాల్ రెడ్డి, స్కాట్ జిల్లా కార్యదర్శి ప్రమీల పాల్గొన్నారు.



దస్తగిరిని సన్మానిస్తున్న రసూల్, నూరుల్లా

మదీనా దస్తగిరికి ఘన సన్మానం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

జిల్లా వైసిపి మైనార్టీ సెల్ అధ్యక్షులుగా నియమితులైన మదీన దస్తగిరిని తన నివాసం మైదుకూరులో పులివెందులకు చెందిన వైసిపి రాష్ట్ర నూర్‌బాషా అధ్యక్షులు రసూల్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మదీనా దస్తగిరి మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డికి, వైసిపి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఎక్కువగా వైసిపి బలోపేతానికి, పార్టీ విజయానికి తన సర్వశక్తులు వడ్డుతానని దస్తగిరి పేర్కొన్నారు. పార్టీ అధిష్టాన ఆదేశాల మేరకు ప్రతి కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైసిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ నూరుల్లా, జమ్మలమడుగు నూర్ బాషా సంఘం వైస్ ప్రెసిడెంట్ బెల్లంకొండ దస్తగిరి, రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు సురేంద్ర, వైసిపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న ఎఒ అమర్‌నాథ్‌రెడ్డి

పంటల యాజమాన్యంపై అవగాహన

ప్రజాశక్తి - దువ్వూరు

మండల పరిధిలోని నీలాపురం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఎఒ అమర్నాథ్‌రెడ్డి రైతులకు పలు సూచనలు చేశారు. రబీ పంటల్లో యాజమాన్య పద్ధతులు, పురుగులు, తెగుళ్ల యాజమాన్య పద్ధతులు వివరించారు. ప్రకృతి వ్యవసాయంతో కలిగే లాభాలు, వ్యవసాయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది రవి, చంద్రమ్మ, సురేష్, ఆదిలక్ష్మి, రమాదేవి, గ్రామ వ్యవసాయ అసిస్టెంట్ సమీరా హాజరయ్యారు.

ట్రిపుల్‌ఐటిలో క్యాంటీన్లు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్జీయుకేటీ యూనివర్సిటీ పరిధిలోని ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ, ఒంగోలు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌ల్లో విద్యార్థుల కోసం క్యాంటీన్లు, సూపర్ మార్కెట్లను ఏర్పాటు చేయాలని ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహంతుల్లా, జిల్లా ఉపాధ్యక్షుడు దాదాపీర్ కోరారు. బుధవారం వేంపల్లెలో వారు విలేకరులతో మాట్లాడుతూ గతంలో ట్రిపుల్‌ఐటీల్లో ఉన్న క్యాంటీన్లు, సూపర్ మార్కెట్లను మూసి వేయడంతో విద్యార్థులు అవసరమైన నిత్యవసర వస్తువులు కొనుగోలు చేసేందుకు ఇబ్బందులకు గురి అవుతున్నారని చెప్పారు. క్యాంటీన్లు, సూపర్ మార్కెట్ లేకపోవడంతో అధ్యాపకులకు, విద్యార్థులకు కష్టాలు వచ్చినట్లు చెప్పారు. క్యాంటీన్లపై రాజకీయ ప్రభావం ఉండడంతో వాటిని మూసేశారని ఆరోపించారు. రాజకీయ జోక్యం లేకుండా చూడాలన్నారు. దాదాపు 8 నెలల నుండి క్యాంటీన్లు, సూపర్ మార్కెట్లు మూసి వేయడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి అధికారులు క్యాంటీన్లు, సూపర్ మార్కెట్లను వెంటనే తెరిపించాలని కోరారు.



మాట్లాడుతున్న రహంతుల్లా



పశువులకు చికిత్సలు అందజేస్తున్న వైద్యాధికారి

చెంచుపల్లెలో ఉచిత పశువైద్య శిబిరం

ప్రజాశక్తి - చాపాడు

మండల పంచాయతీ చెంచుపల్లె గ్రామంలో బుధవారం పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 9 పశువులకు చూడి పరీక్షలు, 11 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు, 48 దూడలకు నట్టల నివారణ టీకాలు, 186 పెద్ద పశువులకు నట్టల నివారణ మందులు, 26 పశువులకు సాధారణ చికిత్సలు, 4 పశువులకు కృత్రిమ గర్భధారణ పరీక్షలు, 480 జీవాలకు నట్టల నివారణ మందులు తాపించారు. కార్యక్రమంలో చాపాడు పశువైద్యాధికారి డాక్టర్ ఎస్.మహమ్మద్ గౌస్, వివిఏ వెంకటేశ్వరు, వివిఏ చలపతి, ఎహెచ్‌ఎ మహబూబ్ హుస్సేన్, ఎహెచ్‌ఎ దస్తగిరి, ఎహెచ్‌ఎ విష్ణుప్రియ, అమర్‌నాథ్, సిబ్బంది రమాదేవి, రైతులు పాల్గొన్నారు.

పశు పోషకులు మెలకువలు పాటించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పశు పోషకులు మెలకువలు పాటించాలని గూడెంచెరువు పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ జాన్ సుధాకర్ బాబు తెలిపారు. మండల పరిధిలోని పి.బొమ్మేపల్లె గ్రామంలో బుధవారం ఉచిత పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్ సుధాకర్ బాబు మాట్లాడుతూ ఈ నెల 31వ వరకు మండలంలోని అన్ని ముఖ్య గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. బొమ్మేపల్లె గ్రామంలో సుమారు 1,500 గొర్రెలు, 257 మేకలు, 36 దూడలు, 62 గేదెలకు నట్టల నివారణ, ఏలిక పాముల నివారణ మందు తాపించామన్నారు. 8 గర్భకోశ చికిత్సలు, 6 చూడి పరీక్షలు, 85 సాధారణ చికిత్సలు, 35 కోళ్లకు తెగులు నివారణకు టీకాలు, దూడలకు గొంతువాపు టీకాలు వేశామన్నారు. కార్యక్రమంలో గూడెంచెరువు పశుసంవర్ధక శాఖ సహాయక సిబ్బంది సేవలందించారు.



ఆవుదూడకు వైద్యం చేస్తున్న వైద్య సిబ్బంది

విస్తారంగా దోస సాగు

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా దోస సాగును రైతులు విస్తారంగా చేపడుతున్నారు. ముఖ్యంగా చాపాడు, మైదుకూరు, ఖాజీపేట మండలాల్లో దోస సాగును రైతులు చేపడుతున్నారు. సాధారణ రకంతో పాటు, జ్యూస్ రకం దోసకాయలను అధికంగా సాగు చేస్తున్నారు. చాపాడు మండల పరిధిలో అయ్యవారిపల్లి, రామదాసుపురం, సీతంపల్లె, సోమాపురం, సిద్దారెడ్డిపల్లె, ఆనందాశ్రమం, మున్సిపాలిటీ పరిధిలో సరస్వతిపేట, చుట్టుపక్కల ఖాజీపేట మండల పరిధిలో బక్కాయపల్లి, గుంటూరు కొట్టాలు, నడిపెన్న కొట్టాలు, భూమాయపల్లి తదితర గ్రామాల పరిధిలో దోస సాగును రైతులు చేపడుతున్నారు. విత్తనాలను ప్యాకెట్ రూ.1000 వెచ్చించి కొనుగోలు చేసి సాగుచేస్తున్నారు. ఎకరాకు రెండు ప్యాకెట్లు వినియోగిస్తున్నారు. సాగుతోపాటు ఎరువులు వేస్తున్నారు. కాడి ఎద్దులకు, ఎరువులకు ఈ ఏడాది అధికంగా ఖర్చు అవుతుందని రైతులు పేర్కొంటున్నారు. కాడెద్దులు, విత్తనాలు, ఎరువులతో కలిపి ఎకరాకు రూ.12 వేలకుపైగా ఖర్చు అవుతుందని రైతులు పేర్కొంటున్నారు.



సిద్దారెడ్డిపల్లె వద్ద చేపడుతున్న దోస సాగు (ఇన్‌సెట్) విత్తనాలు

నియోజకవర్గ పరిధిలో 1000 ఎకరాల వరకు దోస సాగును రైతులు చేపడుతున్నారు. వారం, పది రోజుల్లో సాగు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. దుక్కిళ్ళు చేపడుతూ రైతులు ప్రయత్నాలు చేస్తున్నారు.

'సీమ'లోనే యాజమాన్య బోర్డును ఏర్పాటు చేయాలి

- పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని రాయలసీమలోనే ఏర్పాటు చేయాలని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టంలో సెక్షన్ 85, సబ్‌సెక్షన్ (1), (2) ప్రకారం రాష్ట్ర విభజన జరిగిన 60 రోజులోపు కేంద్ర ప్రభుత్వం గోదావరి నది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని తెలంగాణాలో, కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. దురదృష్టవశాత్తు 10 సంవత్సరాల 7 నెలలు అయినప్పటికీ కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయం హైదరాబాద్‌లోనే ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ పట్ల కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వ నిర్లక్ష్యం, ప్రాంతీయ పార్టీలైనా టిడిపి, వైసిపి చేతగానితనం ఇందుకు కారణమన్నారు. ఈ బోర్డుకు విస్తృత అధికారాలు ఉంటాయన్నారు. కృష్ణానది మీద తెలంగాణాలో, ఆంధ్రప్రదేశ్‌లో నిర్మించిన, నిర్మాణంలో ఉన్న, నిర్మించబోయే సాగునీటి ప్రాజెక్టులు, జలవిద్యుత్ కేంద్రాల అడ్మినిస్ట్రేషన్, నిర్వహణ, ఆపరేషన్ ఇవన్నీ కూడా బోర్డు పరిధిలోకి వస్తాయన్నారు. కృష్ణానది మీద ఉన్న ప్రధాన ప్రాజెక్టులలో ఎక్కువ భాగం రాయలసీమలోని శ్రీశైలం జలాశయం ఆధారంగా ఉందన్నారు. తెలుగు గంగ, గాలేరు-నగరి, హంద్రీ-నీవా, వెలుగొండ, కల్వకుర్తి, ఎస్ఆర్‌బిసి, శ్రీశైలం కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాలు శ్రీశైలం జలాశయం ఆధారంగా ఉన్నాయని ఆయన వివరించారు. హైదరాబాద్‌లో జరిగిన బోర్డు సమావేశంలో బోర్డు కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడకు తరలించాలని నిర్ణయించడం హర్షణీయమన్నారు. అయితే కర్నూలుకు తరలించకుండా విజయవాడకు తరలించాలని నిర్ణయించడం బాధాకరయన్నారు.

నీటి పంపిణీలో కృష్ణా బోర్డు నిర్ణయంపై హర్షం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఉభయ తెలుగు రాష్ట్రాలకు నీటి పంపిణీలో కృష్ణానది యాజమాన్య బోర్డ్ తీసుకున్న నిర్ణయం హర్షణీయమని పులివెందుల కాంగ్రెస్ పార్టీ నాయకులు కేతిరెడ్డి తిరుపాల్‌రెడ్డి, శివ పేర్కొన్నారు. స్థానికంగా వారు మాట్లాడుతూ కృష్ణా జలాల నీటి వాటాలో తమ రాష్ట్రానికి కూడా సగం వాటా అంటే 50 శాతం నీళ్లు కావాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృష్ణాబోర్డు దృష్టికి తీసుకెళ్లిందన్నారు. ఈ విషయమై హైదరాబాద్ జలసౌధలో మంగళవారం ఇరు రాష్ట్రాల ముఖ్య అధికారులతో చైర్మన్ అతుల్ జైన్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసిందన్నారు. సమావేశంలో పాతపద్ధతిపైనే ఆంధ్రప్రదేశ్‌కు 66 శాతం (512టిఎంసిలు) అలాగే తెలంగాణకు 34 శాతం (299 టిఎంసిలు) జలాలను కేటాయిస్తామని బోర్డు వెల్లడించడం సంతోషకరమన్నారు. గతంలో కూడా ఇదే విషయాన్ని బచావత్ ట్రిబ్యునల్ స్పష్టం చేసిన విషయాన్ని వారు గుర్తు చేశారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు వచ్చేవరకు పాత పద్ధతిని నీటి కేటాయింపులు చేస్తామని బోర్డు స్పష్టం చేయడం అభినందనీయమన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కార్మికులను వేధిస్తున్న కాంట్రాక్టర్



మాట్లాడుతున్న సత్యనారాయణ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

వేతనాలు సరిగ్గా ఇవ్వక, ఎప్పుడో ఇచ్చే ఆరకొర వేతనాల్లో కూడా కోతలు విధిస్తూ జిల్లా ఆస్పత్రిలో విధులు నిర్వహించే మహిళా పారిశుధ్య కార్మికులను కాంట్రాక్టర్ బాలనాగిరెడ్డి వేధిస్తున్నాడని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ ఆరోపించారు. ఆ మేరకు మహిళా కార్మికులతో కలిసి బుధవారం ఆయన ఆసుపత్రి ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వాసుపత్రిలో 65 మంది మహిళా కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరికి ప్రతి నెల 5న ఠంచన్‌గా జీతాలు ఇవ్వాల్సి ఉంది. ఏ ఒక్క నెల కూడా 5వ తేదీన వేతనాలు అందిన దాఖలాల్లేవన్నారు. ఐదు నెలల జీతాలు వేయాల్సి ఉంటే ఇందులో ఒకటి రెండు నెలలు వేతనాలు ఇచ్చి మూడు నెలల జీతాలు బకాయి ఉంచడం వంటివి చేస్తున్నారని సత్యనారాయణ ఆరోపించారు. ఇంతవరకు ఈ కాంట్రాక్టర్ బకాయిలు లేకుండా వేతనాలు ఇవ్వలేదన్నారు. కార్మికులు అడిగితే బెదిరింపు ధోరణిలో మాట్లాడుతున్నారన్నారు. మిమ్మల్ని తీసేస్తా ఇంటికిపోండి అని బెదిరిస్తున్నాడన్నారు. ఇదిలా ఉండగా వీరికి నిబంధనల మేరకు రూ.16 వేలు వేతనం ఇవ్వాల్సి ఉంది. ఇందులో కూడా దోపిడీ జరుగుతోందన్నారు. కార్మికులకు కేవలం రూ.11వేలు చేతిలో పెట్టి వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇచ్చి మాట్లాడితే ఈ విషయం తాను కాంట్రాక్టర్‌తో మాట్లాడాను.. ఈనెల్లో ఇస్తాం అని అన్నాడని ఎప్పటికప్పుడు వాయిదా వేస్తున్నారని కార్మికులు చెబుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి విజయకుమార్, ప్రభుత్వాసుపత్రి బాధ్యులు పి.రాఘవేంద్ర, మహిళా కార్మికులు కళావతి, రత్నమ్మ, లక్ష్మీదేవి, దుర్గాదేవి పాల్గొన్నారు.

నైతిక విలువలతో కూడిన విద్యను అందివ్వాలి



స్వామి సన్నివాసానందని సన్మానిసున్న రామాంజనేయరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యాలయాలు విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యను అందించినప్పుడే ఆ విద్యకు సార్థకత ఉంటుందని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి పేర్కొన్నారు. పులివెందుల రోడ్డులో ఉన్న స్వామి వివేకానంద పాఠశాల 24వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ తులసిరెడ్డి మాట్లాడుతూ అన్ని సంపదలో విద్యా సంపద గొప్పదన్నారు. అలాంటి గొప్ప సంపదను చిన్న వయసు నుండే క్రమశిక్షణతో విద్యను నేర్చుకోవాలని కోరారు. నైతిక విలువలు లేని విద్య ప్రమాదకరమన్నారు. స్వామి వివేకానంద స్ఫూర్తితో కరస్పాండెంట్ రామాంజనేయరెడ్డి ఈ పాఠశాలను ప్రారంభించారని, అదే స్ఫూర్తితో విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందిస్తూ ఉండడం అభినందనీయమన్నారు. పిల్లలకు బాల్యం నుండే సేవాగుణం వచ్చేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని రామకృష్ణ మఠం ఉపాధ్యక్షుడు స్వామి సన్నివాసానంద ఉద్బోధించారు. చిన్నప్పటినుండే నిజాలు చెప్పే అలవాటును పిల్లలకు నేర్పాలని ఎస్ఐ తిరుపాల్ నాయక్ సూచించారు. అనంతరం చదువు, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్స్, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో స్వామి వివేకానంద పాఠశాల కరెస్పాండెంట్ రామాంజనేయరెడ్డి, కాంగ్రెసు నాయకులు అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, రమణ, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చేపపిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి

అర్హులైన మత్స్యకారులు లైసెన్స్ కలిగి ఉండాలి

ప్రజాశక్తి - కొండాపురం

ప్రధానమంత్రి మత్స్య సంపద పథకం కింద మండల కేంద్రమైన కొండాపురం పాత పోలీస్ స్టేషన్ దగ్గర గండికోట రిజర్వాయర్ వెనుక జలాల్లో బుధవారం జమ్మలమడుగు ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి మత్స్యకారుడు లైసెన్స్ కలిగి ఉండాలని, లైసెన్సు ఉన్నవారికి 50ఏళ్లు పైబడిన వారికి పెన్షన్ వస్తుందని తెలిపారు. ఆగస్టు వరకు చేపల వేటకు వెళ్లవద్దన్నారు. ఆగస్టు తర్వాత లైసెన్స్ ఉన్న వారు మాత్రమే చేపల వేటకు వెళ్లాలని తెలిపారు. లైసెన్స్ లేని వారు చేపల వేటకు వెళితే మీడియాకు, పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌డిఎ కూటమి మండల ఇన్‌ఛార్జి శివ నారాయణరెడ్డి, టిడిపి మండలశాఖ అధ్యక్షుడు గండ్లూరు నాగేశ్వర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, రెండెద్దుల రామాంజనేయుల రెడ్డి, మాజీ సర్పంచ్ విశ్వనాథరెడ్డి, ఎంపిటిసి శ్రీ రామ్‌రెడ్డి, ఎంపిడిఒ నాగప్రసాద్ ఫిషరీ డిడి శాంతా, చౌట్టిపల్లి విలేజ్ అసిస్టెంట్ మల్లేశ్వరి, కొండాపురం సిఐ మహమ్మద్ రఫీ, తాళ్ల ప్రొద్దుటూరు ఎస్ఐ రిషికేశవరెడ్డి పాల్గొన్నారు.

నేడు లింగాల మండల సమావేశం

ప్రజాశక్తి - లింగాల

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపిపి రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు తమ నివేదికలతో తప్పక హాజరుకావాలన్నారు. ప్రజాప్రతినిధులు సమావేశంలో సమస్యలు ఉంటే తెలపాలన్నారు. అభివృద్ధిపై చర్చించాలన్నారు.

ప్రతి రైతుకూ ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి - వేముల

ప్రతి రైతు ఇకెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలని ఎడిఎ ఎ.ప్రభాకర్‌రెడ్డి సూచించారు. వేముల రైతు సేవ కేంద్రంలో బుధవారం ఆయన ఎఒ వి.చెన్నారెడ్డితో కలిసి వ్యవసాయ అసిస్టెంట్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ మండలంలో రబీ సీజన్‌లో 3,524 మంది రైతులు 10,815 ఎకరాల్లో పంట నమోదు చేయించుకున్నారని, 3,524 మంది రైతుల్లో 2,087 మంది రైతులు మాత్రమే ఇకెవైసి చేయించుకున్నారన్నారు. వేముల మండలంలో 59శాతం మాత్రమే ఇకెవైసి పూర్తయిందన్నారు. అనంతరం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వేరుశనగ పంటను పరిశీలించారు. వేరుశనగలో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించడానికి నూతన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు.



రైతు సేవ కేంద్రంలో సిబ్బందికి సూచనలిస్తున్న ఎడిఎ ఎ.ప్రభాకర్‌రెడ్డి



పొలాలను పరిశీలిస్తున్న జెసి, ఆర్‌డిఒ

ప్రజలకు ఇబ్బందిలేకుండా చూడాలి

ప్రజాశక్తి - దువ్వూరు

ప్రజలకు ఇబ్బందిలేకుండా చూడాలని జెసి అదితి సింగ్ అధికారులకు సూచించారు. మండలంలోని ఇడమడక గ్రామంలో బుధవారం నిర్వహించిన భూ రీ సర్వే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.ముందుగా ఆమె తహశీల్దార్ కార్యాలయంలో వచ్చిన అర్జీలను తీసుకున్నారు. జమ్మలమడుగు ఆర్‌డిఒ సాయిశ్రీ, దువ్వూరు ఎంఆర్‌ఒ అక్బల్ బాషా పాల్గొన్నారు.

మొక్కల పెంపకం తప్పనిసరి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు తప్పనిసరిగా నాటి, వాటిని సంరక్షించాలని మాజీ జెడ్పిటిసి సభ్యుడు పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సింహాద్రి పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల న్యూ క్యాంపస్‌లో బుధవారం ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పోరెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని సూచించారు. అనంతరం రాజమండ్రి వద్ద నున్న కడియం నర్సరీ నుంచి తెప్పించిన మొక్కలు నాటారు. అనేక రకాల పండ్ల మొక్కలు (మామిడి, అల్ల నేరేడు, పనస, అంజూర, ఉసిరి), నిత్యం ఆక్షిజన్ ఇచ్చే రావి, పగలంతా ఎక్కువ శాతం ఆక్షిజన్ ఇచ్చే వేప త్వరగా కాయలు కాసే హైబ్రెడ్ రకం కొబ్బరి మొక్కలు నాటారు. ప్రాంగణాన్ని సుందరీకంచడానికి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉమా మహేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

జమ్మలమడుగులో రేపు డీలర్లకు రాత పరీక్ష

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని 17 రేషన్ షాపులకు సంబంధించిన ఖాళీలను భర్తీ చేయడానికి డీలర్లకు ఈ నెల 24న మధ్యాహ్నం 3 గంటలకు జమ్మలమడుగులో రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ రమాకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది డిసెంబర్ 31 నుంచి జనవరి 8వ తేదీ వరకు 7మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. విశ్వనాథ పురం, మొర్రాయపల్లె, పల్లవోలు, రాజువారిపేట, రాజుపాలెం, టిఒ పల్లెలో చౌక దుకాణాల భర్తీకి రాత పరీక్ష ఉంటుందన్నారు. జమ్మలమడుగులోని కాపు వీధి, సూర్య ఆయిల్ మిల్ దగ్గర ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్ష ఉంటుందన్నారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

జనసేన పార్టీ గుర్తింపుపై హర్షం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్ : కేంద్ర ఎన్నికల సంఘం జనసేన పార్టీని గుర్తిస్తూ, ఆ పార్టీకి చెందిన గ్లాస్ గుర్తును కేటాయించడం హర్షణీయమని పులివెందుల జనసేన నాయకుడు ఆలూరు ముని జగదీష్ బాబు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ చేసిన అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాల్లో గెలుపొందడం రాష్ట్ర చరిత్రలోనే లిఖించదగ్గ విషయమన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

గ్రామ పంచాయతీల అభివృద్ధికి కార్యదర్శులు, సర్పంచులు కృషి చేయాలని ఎంపి డిఒ అలవలపాటి ముకుందారెడ్డి సూచించారు. స్థానిక మండల ప్రజా పరిష్యత్ కార్యాలయంలో బుధవారం ముకుందారెడ్డి ఆధ్వర్యంలో మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యదర్శులు, సర్పంచుల సమన్వయంతో గ్రామ పంచాయతీల్లోని సమస్యలు పరిష్కరించాలన్నారు. చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఆయా శాఖల అధికారులు సభలో వివరించారు. కార్యక్రమంలో ఎంపిపిలు, మండల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ ముకుందారెడ్డి

విద్యుత్ శాఖ మంత్రిని కలిసిన టిఎన్‌వి నాయకులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం : రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్‌ను బుధవారం పులివెందుల తెలుగునాడు విద్యుత్ యూనియన్ నాయకులు కలిశారు. విజయవాడలోని మంత్రి కార్యాలయంలో కలిసి వారు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పులివెందుల డివిజన్ నాయకులు నారాయణరెడ్డితోపాటు పలు వురు కార్మికులు సమస్యలను మంత్రికి వివరించారు. మంత్రి స్పందిస్తూ విద్యుత్ కార్మికుల సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు యూనియన్ నాయకులు తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి-కాశినాయన : గ్రామాలలో ప్రజలకు విఆర్‌ఒలు అందుబాటులో ఉండి ప్రతి సమస్యను పరిష్కరించాలని తహశీల్దార్ వెంకటసుబ్బయ్య తెలిపారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో విఆర్‌ఒలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో భూ సమస్యలు ఎప్పటికప్పుడూ పరిష్కరించాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రీ సర్వేలు వెంటనే పూర్తి చేయాలని పేర్కొన్నారు. గ్రామాలలో ఎవరితోనైనా ఏమైనా ఇబ్బందులుంటే వెంటనే తమ దృష్టికి తేవాలన్నారు భూ సమస్యలు ఉన్నప్పుడు కచ్చితంగా తన దృష్టికి తీసుకొస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు గ్రామాల్లో ఎంతటి వారైనా సరే రెవెన్యూ చట్టం ప్రభుత్వ నిబంధన ప్రకారం పని చేయాలని, ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని తెలిపారు. కార్యక్రమంలో విఆర్‌ఒలు పాల్గొన్నారు .

ఎమ్మెల్యే సుధాకు సన్మానం

ప్రజాశక్తి - గోపవరం : వైసిపి అధ్యక్షులు వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు జిల్లా సేవాదళ్ అధ్యక్షులుగా శ్రీకాంత్ రెడ్డి, జిల్లా సెక్రటరీగా నాగేశ్వర్ రావును నియమించారు. ఈ సందర్భంగా వారు బద్వేల్ నియోజక వర్గ శాసన సభ్యులు డాక్టర్ దాసరి సుధాను మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువతో సన్మానించారు. నూతనంగా నియమితులైన వారిని ఎమ్మెల్యే అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిపక్షంలో పార్టీ పదవులు ముళ్ళ కిరీటం లాంటివి అని పార్టీ ఇచ్చే ఆదేశాలు పాటిస్తూ కార్యకర్తలకు అందు బాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి, సుందర రామిరెడ్డి, వైస్ చైర్మన్ సాయి కృష్ణ, పార్టీ సీనియర్ నాయకులు శ్రీరా ములు, మున్సిపల్ జెసిఎస్ కన్వీనర్ యద్దారెడ్డి, కౌన్సిలర్స్ సత్యం, ఆయా వార్డు ఇన్‌ఛార్జులు చెన్నాకృష్ణరెడ్డి, బాబు, కన్వీనర్ పుల్లయ్య, నాయకులు రఘురాంరెడ్డి పాల్గొన్నారు.

డిజిపిని కలిసిన శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలోని ఆర్ అండ్ బి గేస్ట్ హౌస్‌లో డిజిపి ద్వారకా తిరుమలరావును టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పలు అంశాలు ఆయన దృష్టికి శ్రీనివాసరెడ్డి తీసుకువెళ్లారు. డిజిపితో డిఐజి కోయ ప్రవీణ్, అన్నమయ్య జిల్లా ఎస్పి వి.విద్యాసాగర్ నాయుడు ఉన్నారు.

క్రైం కార్నర్

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణంలో రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలో బుధవారం రైల్వే ట్రాక్‌పై రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. సదరు వ్యక్తి అనుమానాస్పదంగా మరణించాడని స్థానికులు పేర్కొంటున్నారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.